సాక్షి చిత్తూరు
గురువారం । 7 । మార్చి । 2024



ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణ

ఎన్నికల షెడ్యూల్ వచ్చిన వెంటనే కోడ్ అమల్లోకి వస్తుందని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ వెల్లడించారు - 8లో



జగనన్న పాలనలో కుప్పం అభివృద్ధి

సీఎం జగనన్న పాలనలోనే కుప్పంలో నిజమైన అభివృద్ధి జరుగుతోందని ఎమ్మెల్సీ భరత్ అన్నారు. - 8లో



అన్నదాతకు అండగా ప్రభుత్వం

రాష్ట్రప్రభుత్వం అన్నదాతలకు అండగా నిలుస్తోందని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. - 8లో

న్యూస్‌రీల్

మహానందీశ్వరుడికి పట్టు వస్త్రాల సమర్పణ



పట్టువస్త్రాలను సమర్పిస్తున్న కాణిపాకం ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు

కాణిపాకం: మహానందీశ్వరునికి కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి పట్టు వస్త్రాలను ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు అందించారు. నంద్యాల జిల్లాలోని మహానందిలో వెలసిన కామేశ్వరి సమేత నందీశ్వరుని బ్రహ్మోత్సవాల సందర్భంగా కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయం నుంచి బుధవారం ఆలయ చైర్మన్, ఈఓ పట్టు వస్త్రాలను తీసుకెళ్లారు. మహానందీశ్వర ఆలయ ఈఓ చంద్రశేఖర్ రెడ్డి, మాజీ చైర్మన్ మహేశ్వర్ రెడ్డి వీరికి మేళతాళాలతో మంగళ వాయిద్యాలతో స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయం తరఫున పట్టువస్త్రాలను అందజేశారు. అనంతరం కాణిపాకం ఆలయ చైర్మన్, ఈఓలకు వేదపండితులచే ఆశీర్వచనం అందించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో కాణిపాకం ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ రమేష్, వేదపండితులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 04 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 64,552 మంది స్వామివారిని దర్శించుకోగా 19,900 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.91 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా, టిక్కెట్లు లేని వారికి 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం పూర్తవుతోంది.

హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ద్రాక్షాయణి



చిత్తూరు అగ్రికల్చర్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ద్రాక్షాయణిని నియమిస్తూ బుధవారం ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు నియామకపత్రాన్ని ఆమెకు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెనుమూరు మండలం ఉగ్రాణంపల్లెకు చెందిన తాను 2019 ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపునకు సోషల్ మీడియా ద్వారా తనవంతు కృషి చేశామన్నారు. తన సేవలను గుర్తించి ఉన్నత స్థాయి పదవిని ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఎప్పటికీ రుణపడి ఉంటానని తెలిపారు. రానున్న ఎన్నికల్లో కూడా వైఎస్సార్‌సీపీ విజయానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

మహిళామణులకు సత్కారం రేపు

చిత్తూరు రూరల్: జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నవ్యాంధ్ర రాష్ట్ర రచయితల సంఘం ఆధ్వర్యంలో పలువురు మహిళామణులను సత్కరించనున్నట్లు సంఘ జిల్లా అధ్యక్షురాలు కరణం విమల బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. చిత్తూరు నగరంలోని రెవెన్యూ భవనంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని అందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆమె కోరారు.

జిల్లాకు చేరిన టెన్త్ ప్రశ్నపత్రాలు



ప్రశ్నపత్రాల తరలింపు ప్రక్రియను పర్యవేక్షిస్తున్న డీఆర్‌ఓ పుల్లయ్య

చిత్తూరు కలెక్టరేట్ : పదో తరగతి ప్రశ్నపత్రాలు బుధవారం జిల్లా కేంద్రానికి విచ్చేశాయి. విజయవాడ నుంచి ప్రశ్నపత్రాలను ప్రత్యేక వాహనంలో పకడ్బందీగా బందోబస్తు నడుమ జిల్లాకు పంపించారు. జిల్లాకు మొదటగా విచ్చేసిన సెట్ 1 ప్రశ్నపత్రాలను డీఈఓ కార్యాలయం పక్కన ఉన్న స్ట్రాంగ్‌రూంలో భద్రపరిచారు. అనంతరం వాటిని జిల్లావ్యాప్తంగా 33 పోలీస్‌స్టేషన్‌లకు ప్రత్యేక వాహనాల్లో తరలించారు. ఈ నెల 7వ తేదీన సెట్–2 ప్రశ్నపత్రాలు జిల్లాకు వస్తాయని విద్యాశాఖ అధికారులు తెలిపారు. జిల్లా అబ్జర్వర్ మస్తానయ్య, డీఈఓ దేవరాజు, జిల్లా పరీక్షల విభాగం ఏసీ చాముండేశ్వరి, డీవైఈఓ చంద్రశేఖర్, ఎంఈఓలు, పోలీస్‌లు పాల్గొన్నారు.

బాధ్యత బీసీకి.. పెత్తనం కమ్మకు



కుప్పంలో బీసీలను చంద్రబాబునాయుడు దగా చేస్తున్నారు. అత్యధికంగా బీసీలు ఉన్న ఈ నియోజకవర్గ ఎమ్మెల్యే సీటును కమ్మ సామాజిక వర్గానికి చెందిన చంద్రబాబు కబ్జా చేశారు. ఒకటి కాదు..రెండుకాదు.. ఏకంగా 35 ఏళ్లు పాతుకుపోయారు. ఇక్కడి ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని అభివృద్ధి పేరుతో గారడీలు చేస్తున్నారు. బీసీల డీఎన్‌ఏలోనే టీడీపీ ఉందంటూ బోల్తా కొట్టిస్తున్నారు. తన సొంత నియోజకవర్గం చంద్రగిరిని వదిలి కుప్పానికి వచ్చి బీసీలను నిలువునా ముంచేస్తున్నారు. పదవి ఒకరిది.. పెత్తనం మరొకరికి అప్పగించి వేడుక చూస్తున్నారు. దీనిపై స్థానికులు రగిలిపోతున్నారు. బీసీల ద్రోహి చంద్రబాబు అంటూ విరుచుకుపడుతున్నారు. స్థానికేతరుడైన బాబుకు ఈ సారి గుణపాఠం తప్పదని హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

- కుప్పంలో ప్రతిపక్ష నేత చంద్రబాబు తీరు
- నియోజకవర్గంలో 48.23 శాతం బీసీ ఓటర్లే
- ఒక్క శాతం కూడా లేని కమ్మ సామాజికవర్గం
- అడుగడుగునా అవమానాలపై రగిలిపోతున్న కుప్పం బీసీలు

కుప్పంలో కులాల వారీగా ఓట్లు

సామాజిక వర్గం	ఓట్ల శాతం
వన్నెకుల క్షత్రియులు	23.29
ఎస్సీ	14.65
కురబ, యాదవ	7.46
ముస్లింలు	6.91
బలిజ	6.79
బోయ, వాల్మీకి	6.01
గాండ్ల	5.30
రెడ్డి	4.52
వడ్డెర	3.84
ఆగముడిగన్	2.71
ఎస్టీ	2.33
రజక	1.62
విశ్వకర్మ	1.51
దాసరి, జంగమ	1.49
ముత్తరాసి	1.32
బ్రాహ్మణ	1.08
మంగలి	1.07
వైశ్య	1.06

సాక్షి, తిరుపతి: బీసీలు అత్యధికంగా ఉన్న కుప్పం నియోజకవర్గాన్ని ఒక్క శాతం కూడా లేని కమ్మ సామాజిక వర్గానికి చెందిన చంద్రబాబు కబ్జా చేశారు. 35 ఏళ్లుగా కుప్పంలో బీసీలకు ఎమ్మెల్యే పదవి దక్కకుండా అడ్డుకుంటున్నారు. కుప్పంలో చంద్రబాబును మోస్తున్న బీసీ నేతలు ఆయన తీరుపై మండిపడుతున్నారు. మూడున్నర దశాబ్దాలుగా మాయమాటలతో బీసీల అమాయకత్వాన్ని ఓట్ల రూపంలో మలచుకుంటూ వారిని దగా చేస్తున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం బీసీలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా కుప్పం నుంచి బీసీ సామాజిక వర్గానికి చెందిన వారికే టికెట్ ఇస్తూ వస్తున్నారు. 2014, 2019లో బీసీ (వన్నెకుల క్షత్రియ) సామాజిక వర్గానికి చెందిన చంద్రమౌళిని అభ్యర్థిగా నియమించారు. తాజాగా దివంగత చంద్రమౌళి కుమారుడు భరత్‌ని వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిపిస్తే.. మంత్రి పదవి ఇచ్చి కేబినెట్‌లో తన పక్కన కూర్చోబెట్టుకుంటానని సీఎం ప్రకటించారు. ఎమ్మెల్యే కంటే ముందే భరత్‌కు ఎమ్మెల్సీ పదవి ఇచ్చి బీసీలను గౌరవించారు. కుప్పం నియోజకవర్గంలో 48.23 శాతం బీసీ సామాజిక వర్గానికి చెందిన వారి ఓట్లు ఉంటే.. అందులో 23.29 శాతం ఓట్లు వన్నెకుల క్షత్రియ సామాజిక వర్గం వారివే. అయినా నియోజకవర్గంలో చంద్రబాబు బీసీలకు ప్రాధాన్యం ఇవ్వటం లేదు. చంద్రబాబు సామాజికవర్గానికి చెందిన వారి ఓట్లు ఒక్క శాతం కూడా లేవు. లెక్కపెడితే పట్టుమని వెయ్యి ఓట్లు కూడా లేవని తేలింది.

పేరుకే బీసీ ఇన్‌చార్జ్

ముప్పై ఐదేళ్లుగా కుప్పం ఎమ్మెల్యేగా ఉన్న చంద్రబాబు నివాసం మాత్రం హైదరాబాద్‌లో. కుప్పంలో తనకు బదులు బీసీ సామాజిక వర్గానికి చెందిన మునిరత్నంను ఇన్‌చార్జ్‌గా నియమించారు. అయితే ఆయన పేరుకే ఇన్‌చార్జ్, పెత్తనమంతా కమ్మసామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్సీ శ్రీకాంత్‌కు అప్పగించారు. ఈయన ప్రకాశం జిల్లాకు చెందిన నాయకుడు కావటం గమనార్హం. కొంతకాలంగా నియోజకవర్గంలో ఆయన పెత్తనమే నడుస్తోంది. స్థానిక టీడీపీ నాయకుల సూచనలను, సలహాలను పెడచెవిన పెట్టినట్లు సమాచారం. స్థానిక నాయకులకు ప్రాధాన్యం లేకపోవటంతో టీడీపీ నాయకులు అవమానంగా భావిస్తున్నారు. చంద్రబాబును 14 ఏళ్లు సీఎంగా, ఏడు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఎన్నుకున్నా కనీసం తాగు, సాగు నీరు కూడా తీసుకురాలేకపోయారని నియోజకవర్గ ఓటర్లు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. తమతో పార్టీకి ఊడిగం చేయించుకుని ఇప్పుడు బయటి వ్యక్తులకు ప్రాధాన్యం ఇస్తారా? అంటూ బీసీ నేతలు మండిపడుతున్నారు.

పక్క రాష్ట్రాల నుంచి..

ఎన్నికల కోసం అంటూ కుప్పంలో మరో రెండు వేల మందిని పక్క రాష్ట్రాల నుంచి బాబు దింపుతున్నారు. అందులో భాగంగా ఇప్పటికే 200 మంది కర్ణాటక వాసులు కుప్పంలో తిష్టవేశారు. వీరు గ్రామాలు, వార్డుల్లో టీడీపీ శ్రేణులు, ఓటర్లు ఎటువైపు ఉన్నారో సర్వే చేసి చంద్రబాబుకు నివేదిక ఇచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ ఎన్నికల్లో స్థానికులకే కాకుండా బయటి వారికే బాధ్యతలు అప్పగించటం మంచిదనే నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన వెంటనే 2వేల మంది కర్ణాటక, తమిళనాడు వాసులను కుప్పానికి దిగుమతి చేసుకోనున్నారు. వీరంతా టీడీపీ శ్రేణులపై నిఘా పెట్టటడంతో పాటు, కుప్పం ఓటర్లను మభ్యపెట్టేందుకు ప్రత్యేక శిక్షణ తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చాక కుప్పానికి కృష్ణా జలాలు తీసుకు రావడం, నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమం కోసం రూ.1,400 కోట్లు ఖర్చుచేయడంపై జరుగుతున్న చర్చ నుంచి ఓటర్ల దృష్టిని మరల్చేందుకే వీరిని రంగంలోకి దింపుతున్నట్లు టీడీపీ శ్రేణులు చర్చించుకుంటున్నారు.

వైభవంగా ధ్వజారోహణం



బంగారుపాళెం: మొగిలిలో ధ్వజపటాన్ని ఎగురవేస్తున్న అర్చకులు

బంగారుపాళెం: మొగిలి మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం ధ్వజారోహణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం శ్రీకామాక్షి సమేత మొగిలీశ్వరస్వామి వారికి అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం కలశస్థాపన చేశారు. ఆలయం ఎదురుగా ఉన్న ధ్వజస్తంభం వద్ద అర్చకులు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ధ్వజస్తంభాన్ని పవిత్ర జలంతో శుద్ధి చేసి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ధ్వజపటాన్ని ఎగురవేశారు. బంగారుపాళెంకు చెందిన గోమతి స్పిన్నింగ్‌మిల్లు యాజమాన్యం వారు ఉభయదారులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి మునిరాజు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

హంసవాహనంపై మొగిలీశ్వరుడి కటాక్షం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి కామాక్షి సమ్మేత శ్రీమొగిలీశ్వరస్వామి హంస వాహనంపై కొలువుదీరి భక్తులకు అభయమిచ్చారు. అలాగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం అధికార నందివాహనం, రాత్రి సింహ వాహన సేవ నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు.



హంసవాహనంపై విహరిస్తున్న స్వామివారు

మీ ఆడబిడ్డగా అన్నీ చేస్తున్నా..

- సెంగుంధర్ల సెంటర్‌లో జగనన్న సమావేశ మందిరం ప్రారంభోత్సవంలో మంత్రి రోజా
- ప్రహరీ నిర్మాణానికి, తుడా పార్కుకు భూమిపూజ
- వచ్చే ఎన్నికల్లో మరోమారు వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించండి



మాట్లాడుతున్న మంత్రి రోజా



జగనన్న సమావేశ మందిరం ప్రారంభం, తుడా పార్కు, ప్రహరీలకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి రోజా

పుత్తూరు: మీ ఆడబిడ్డగా మీ సంక్షేమం కోసం పాటుపడుతున్నానని పర్యాటక సాంస్కృతిక యువజన క్రీడా శాఖ మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. బుధవారం స్థానిక గేట్‌పుత్తూరులో రూ.43 లక్షలతో నిర్మించిన జగనన్న సమావేశ మందిరాన్ని ప్రారంభించారు. అలాగే రూ.25 లక్షలతో మందిర ప్రహరీ నిర్మాణానికి, తుడా పార్కుకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సామాజిక అవసరాలను తీర్చడంలో నేటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముందంజలో ఉందన్నారు. జగనన్న సమావేశ మందిరంలో స్థానికులు ఎలాంటి రుసుము చెల్లించకుండా వివాహాది శుభకార్యాలు చేసుకోవచ్చని తెలిపారు. ఇందుకు అనుగుణంగా మందిరాన్ని ప్రత్యేకంగా నిర్మించడం జరిగిందన్నారు. సమీపంలోనే ఆహ్లాదకరమైన తుడా పార్కును నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే గేట్‌పుత్తూరులో అవసరమైన రోడ్లు, కాలువలు నిర్మించడం జరిగిందన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ చంద్రబాబు మేనిఫెస్టో పేరిట అరచేతిలో వైకుంఠం చూపుతున్నారని అన్నారు. ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిపోయి, హైదరాబాద్ నుంచి పారిపోయి వచ్చిన వ్యక్తి చంద్రబాబు అన్నారు. ఈయన ముఖ్యమంత్రిగా 14 ఏళ్లలో ఏమీ చేయలేక పోయారని, అదే జగనన్న తొలి ఐదేళ్లలోనే ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సంక్షేమం, అభివృద్ధిని చేసి చూపించారని కొనియాడారు. కార్యక్రమంలో రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి, వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి, తుడా డీఈఈ రవీంద్ర, మున్సిపల్ కమిషనర్ కెఎల్‌ఎన్‌రెడ్డి, చైర్మన్ ఏ.హరి, వైస్ చైర్మన్లు డి.శంకర్, డి.జయప్రకాష్, సదాశివ కోన చైర్మన్ జయచంద్రన్, సచివాలయ కన్వీనర్ ఏకాంబరం, ఎంఎల్‌ఓ దిలీప్, మైనారిటీ ఫైనాన్స్ డైరెక్టర్ మాహీన్, కౌన్సిలర్లు కుప్పమ్మ, పవన్‌కుమార్, చిట్టిబాబు, నాయకులు తిరునావక్కర్సు, లత, గోపి, శక్తివేలు, సురేష్, సుందరం, ఏలుమలై, టీచర్ అన్నామలై, శ్రీనివాసులురెడ్డి, ఏకాంబరం, వెంకటేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమృత్ భారత్ పనుల పరిశీలన

- చిత్తూరులో రైల్వే గుంతకల్లు డివిజన్ ఏజీఎం ధనుంజయులు పర్యటన
- ఉన్నతాధికారి రాకతో హడావుడి చేసిన అధికారులు



చిత్తూరు రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఏజీఎం ధనుంజయులు

చిత్తూరు కార్పొరేషన్: అమృత్ భారత్ పథకం కింద చిత్తూరు రైల్వేస్టేషన్‌ను రూ.14 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. గుంతకల్లు డివిజన్ ఏజీఎం ధనుంజయులు బుధవారం చిత్తూరుకు విచ్చేశారు. ప్రవేశమార్గంలోని పార్కు, స్టేషన్‌లో జరుగుతున్న నిర్మాణ పనులను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. పలు అంశాల గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. ఉన్నతాధికారి రాకతో స్థానిక రైల్వే అధికారులు హడావుడి చేశారు. స్టేషన్‌ను పరిశుభ్రంగా ఉంచారు. విచారణ కార్యాలయం నిర్వహణ సక్రమంగా లేదని, మూడో ప్లాట్‌ఫాం గట్టు నిర్మించాలని ప్రయాణికులు ఆయనకు విన్నవించారు. ఇంత పెద్ద స్టేషన్‌లో భద్రత డొల్లగా ఉందని, అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని ఫిర్యాదు చేశారు.

రైళ్లు ఆపండి..

చిత్తూరు స్టేషన్‌లో ఆరు ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగడం లేదని, అవి ఇక్కడ నిలిపాలని బీజేపీ, చిత్తూరు స్మార్ట్ సిటీ సంఘం నాయకులు ఏజీఎం ధనుంజయులుకు వినతిపత్రం అందజేశారు. అలాగే కాట్పాడి–తిరుపతి వయా చిత్తూరు మధ్య డబుల్‌లైన్, చిత్తూరు రిజర్వ్ ఫారెస్ట్ దగ్గర రైల్వే ఓవర్ బ్రిడ్జి, చెన్నైకి డైరెక్ట్ రైలును ఏర్పాటు చేయాలన్నారు. రైల్వేస్టేషన్‌లో ఉండే పలు ప్రధాన సమస్యలను తెలిపారు. పలు సమస్యలపై ఢిల్లీలో రైల్వే ఉన్నతాధికారులకు అందించిన చేసిన వినతిపత్రం కాపీని బీజేపీ నాయకులు చిట్టిబాబు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రామభద్ర, తాండవమూర్తి, సత్య, శివకుమార్, మల్లికార్జునరావు, రవి, వేలు, సిద్ధార్థ్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

భావి భారత శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడానికే ఇన్‌స్పైర్

- 11 నుంచి రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ మానక్ స్టేట్ లెవల్ ఎగ్జిబిషన్
- విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకే కాంపిటీషన్స్
- డీఈఓ దేవరాజులు



మాట్లాడుతున్న డీఈఓ దేవరాజులు

గంగవరం: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడంతో పాటు బాల మేధావులను భావి భారత శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడానికే ఇన్‌స్పైర్ మానక్ స్టేట్ లెవల్ కాంపిటీషన్స్ నిర్వహిస్తున్నట్టు డీఈఓ దేవరాజులు తెలిపారు. గంగవరం జెడ్పీ హైస్కూల్‌లో అందుకు సంబంధించి చిత్తూరు డీవైఈఓ చంద్రశేఖర్, వివిధ మండలాల ఎంఈఓలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులతో బుధవారం ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతల కలయికే రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ మానక్ కాంపిటీషన్స్ అని అన్నారు. ఈ ఎగ్జిబిషన్‌ను 11వ తేదీ నుంచి 13వ తేదీ మూడు రోజుల పాటు మండలంలోని మదర్‌థెరిసా ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అందుకోసం 26 కమిటీలను ఇదివరకే ఏర్పాటు చేశామన్నారు. 11వ తేదీన రాష్ట్రస్థాయి ప్రదర్శనకు రాష్ట్ర, జిల్లా అధికారులు, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ ఢిల్లీ నుంచి అబ్జర్వర్లు విచ్చేస్తున్నారని తెలిపారు. బాలుర/జెంట్స్ గైడ్ టీచర్లకు పలమనేరు లిటిల్ ఫ్లవర్ ఇంగ్లిష్ మీడియం స్కూల్, బాలికలు/ఉమెన్స్ గైడ్ టీచర్లకు ఎలినా బెటిని హైస్కూల్‌లో వసతి ఏర్పాటు చేశారన్నారు. డీఎస్‌ఓ రమణ, తదితరులు పాల్గొన్నారు.

ఫండ్ కోసమేరా సామీ వాళ్లు వస్తాండేది!

- కాంగ్రెస్ టికెట్ కోసం ఆశావహుల క్యూ
- అబ్బా కాంగ్రెస్‌కు అంత సీను లేదంటున్న జనం

పలమనేరు: ఏమినా విజన్నా.. పలమనేరు కాంగ్రెస్ టిక్కెట్ కావల్లని చాలామంది అడుగుతాండరంట. ఆ పార్టీకి అంతసీనుందా ! ఏమిటికి వీళ్లు బరిలో నిలిచేది నాకైతే అర్థంకాలేదన్నో అన్నాడు సుబ్బన్న. ఈ సంగతి పట్టణంలోని ఓ టీ దుకాణంలో నడిచింది. ఒరి పిచ్చోడా పలమనేరు కాంగ్రెస్‌కు 2019లో పోటీచేసిన ఆయప్పకి పడిన ఓట్లు నోటాకంటే తక్కువరా స్వామి. ఇబ్బుడు కర్ణాటకలో, తెలంగాణాలో కాంగ్రెస్ హామీలతో గెలిచింది. ఎట్టాగు షర్మిలమ్మ వచ్చి చేరింది. దీంతో ఇక్కడ కాంగ్రెస్ ఏమో అయిపోతోందని ఆ పార్టీ ఓళ్లు కల గంటున్నారా సామి..! కాంగ్రెస్‌పార్టీకి ఎప్పుడో నూకలు చెల్లాయి. ఎలాగూ గెలవరని ఆ పార్టీ నాయకులకే తెలుసురా సుబ్బన్న. కానీ టిక్కెట్ వస్తే ఎన్నికల కోసం పార్టీ ఫండ్ ఇస్తుందిరా సామీ. దాన్ని ఎలాగైనే కొట్టేయచ్చనే ప్లాన్‌తో ఇక్కడ పదిమంది దాకా నేనే క్యాండెట్ అని ప్రచారం చేసుకుంటున్నారబ్బ. లేకపోతే వాళ్ల కేమైనా ఖర్మానా చెప్పు.. ఓడిపోయే పార్టీలో నిలిచి గెలిచేమాటేనా ! ఏం మాట అడిగావురా సుబ్బన్న.. కాసింత బుర్రపెట్టి ఆలోచించురా సామీ.. మొన్న ఎలక్షన్ అయినాక పోయిండే కాంగ్రెసోళ్లు ఇప్పుడు పార్టీ ఆఫీసులు బెట్టి జెండాలు కట్టి, సోషల్‌మీడియాలో ప్రచారాలు సేయగానే జనం ఓట్లేస్తారా ఓతూరి ఆలోచించు. నాయనా క్యాండెట్‌కు ఎలక్షన్లలో డబ్బు ఇస్తే దాన్ని కొట్టేసేకి ఇదోమంచి ఛాన్స్‌రా సామీ అని విజన్న వివరంగా జెప్పాడు. అన్నా నేనేమో అనుకోంటి ఇది అసలు సంగతి అని పెదవి విరిచాడు సుబ్బన్న.. టీకొట్లో ఉన్నవాళ్లంతా వీరి మాటలు విని తెగ నవ్వుకున్నారు.

క్లుప్తంగా

గజరాజుపై కపిలేశ్వరస్వామి అభయం



వ్యాఘ్రవాహనంపై ఊరేగుతున్న శ్రీకామాక్షి అమ్మవారి సమేత శ్రీకపిలేశ్వరస్వామి

తిరుపతి కల్చరల్: శ్రీకపిలేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజు బుధవారం రాత్రి సర్వాంగసుందరంగా ముస్తాబైన శ్రీకపిలేశ్వరస్వా మి గజవాహనాన్ని అధిరోహించి భక్తులకు అభయమిచ్చారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు స్వామి వారి గజవాహన సేవ వేడుకగా సాగింది. గజరాజులు ముందు కదులుతుండగా, కళాబృందాల కోలాటాలు, భజనల నడుమ స్వామి వారి గజవాహన సేవ కోలాహలంగా నిర్వహించారు. అడుగడుగునా భక్తులు స్వామి, అమ్మవారికి కర్పూర నీరాజనాలు అందించి దర్శించుకున్నారు. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు స్వామివారి వ్యాఘ్ర వాహ నంపై కొలువై శ్రీసోమస్కందమూర్తి శ్రీకామాక్షి అమ్మవారి సమేతంగా పురవీధుల్లో విహరిస్తూ భక్తు లకు దర్శన మిచ్చారు. భజన మండళ్ల కోలాటాలు, భజనలు, మంగళవాయిద్యాల నడుమ స్వామి ఊరేగుతూ కనువిందు చేశారు.

సారా విక్రేత అరెస్టు

వెదురుకుప్పం: సారా విక్రయిస్తున్న ఓ మహిళను వెదురుకుప్పం పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు కథనం మేరకు.. మండలంలోని వేణుగోపాలపురం గ్రామానికి చెందిన జ్యోతమ్మ సారా తయారు చేస్తూ విక్రయిస్తోంది. ఈ విషయం తెలియడంతో పోలీసులు బుధవారం గ్రామానికి వెళ్లి తనిఖీలు చేపట్టారు. జ్యోతమ్మ వద్ద 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి పుత్తూరు కోర్టుకు తరలించగా రిమాండ్ విధించినట్లు చెప్పారు. గ్రామాల్లో సారా తయారీ, విక్రయా లు చేపట్టడం చేయరాదన్నారు. ఎక్కడైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వెంటనే సమాచారం అందించాలని కోరారు.

రుయాలో సూపర్ స్పెషాలిటీ సేవలు

తిరుపతి తుడా: రుయా ఆస్పత్రిలో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు బుధవారం ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్, రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు సూపర్ స్పెషాలిటీ ఓపీ వైద్య సేవలను ప్రారంభించారు. ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖర మాట్లాడుతూ పేద రోగులకు సూపర్ స్పెషాలిటీ వైద్యాన్ని అందించాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని తెలిపారు. రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రభు మాట్లాడుతూ ప్రతి సోమ, బుధ, శుక్ర, శనివారాల్లో సూపర్ స్పెషాలిటీ ఓపీ, ఐపీ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు.

అన్నదాతకు అండగా ప్రభుత్వం



సమావేశంలో పాల్గొన్న రైతులు

- గతేడాది మిచాంగ్ తుపాను ధాటికి పంటలకు నష్టం
- పంటలు నష్టపోయిన రైతులను ఆదుకుంటున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి
- జిల్లాలో 4,604 మంది రైతులకు రూ.2.78 కోట్లు జమ
- తాడేపల్లి నుంచి సీఎం జగన్‌తో జెడ్పీ చైర్మన్, జిల్లా కలెక్టర్, జేసీ, రైతుల ముఖాముఖి



రైతులకు మెగా చెక్కు అందిస్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

గంగాధర నెల్లూరు: రాష్ట్రప్రభుత్వం రైతులకు అండగా ఉంటోందని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. ఖరీఫ్–2023 వర్షాభావ పరిస్థితులు, మిచాంగ్ తుపాను వల్ల జరిగిన పంటలకు సంబంధించి నష్ట పరిహారాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బుధవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్‌గా రైతుల ఖాతాల్లో నగదు జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని వర్చువల్ విధానంలో జిల్లాస్థాయిలో చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు (జీడీనెల్లూరు) ఎంపీడీఓ కార్యాలయం నుంచి జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, జిల్లా కలెక్టర్ షణ్మోహన్, జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు పాల్గొని రైతులతో కలిసి వీక్షించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్–2023 వర్షాభావం కారణంగా డిసెంబర్‌లో సంభవించిన మిచాంగ్ తుపాను ధాటికి రైతన్నలు పంటలు నష్టపోయారని తెలిపారు. అందులో భాగంగా 4,604 మంది రైతులకు రూ.2.78 కోట్లను ప్రభుత్వం నష్ట పరిహారం కింద అందించిందని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న ఇన్‌పుట్ సబ్సిడీ రైతులకు లబ్ధి చేకూరుతుందని అన్నారు. జిల్లాలో 2019–20 నుంచి ఇప్పటి వరకు ఇన్‌పుట్ సబ్సిడీ ద్వారా 42,668 మంది రైతులకు రూ.19.62 కోట్లు సాయం అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు కేఆర్ వెంకటరెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి సభ్యులు బలరామి రెడ్డి, వ్యవసాయ, ఉద్యానవన శాఖల మండలస్థాయి అధికారులు, రైతులు పాల్గొన్నారు.

నియోజకవర్గాల వారీగా ఇన్‌పుట్ సబ్సిడీ వివరాలు

నియోజకవర్గం	రైతులు	హెక్టార్లు	అందిన సాయం
పలమనేరు	1,668	589	రూ.కోటి
పుంగనూరు	449	183	రూ.31.18 లక్షలు
కుప్పం	1,179	412	రూ.70 లక్షలు
మొత్తం	3,296	1,184	రూ.2.01 కోట్లు

నియోజకవర్గాల వారీగా నష్టపరిహారం వివరాలు

నియోజకవర్గం	రైతులు	హెక్టార్లు	అందిన సాయం
పూతలపట్టు	53	20	రూ.3.33 లక్షలు
జీడీనెల్లూరు	282	96	రూ.16.29 లక్షలు
నగరి	164	47	రూ.8 లక్షలు
పలమనేరు	46	17	రూ.2.87 లక్షలు
పుంగనూరు	763	272	రూ.46.40 లక్షలు
మొత్తం	1,308	452	రూ.76.95 లక్షలు

ఎంతో ఉపయోగపడుతుంది..



నాకు గత నాలుగు ఎకరాల పొలంలో అర్ధ ఎకరాలో వరి వేశాను. తుపానుకు పంట నష్టపోవడంతో ఇన్‌పుట్ సబ్సిడీ కింద నాకు నేడు అందిస్తున్న ఈసాయం ఆర్థికంగా ఎంతో ఉపయోగపడుతుంది. అన్నదాతలను ఆదుకుంటున్న ఈ ప్రభుత్వానికి ఎప్పుడూ అండగా ఉంటాం.

– పురుషోత్తం రెడ్డి, రైతు, ఐరాల మండలం

సాయం అందింది..



నాకున్న రెండు ఎకరాల పొలం ఉంది. ఒక ఎకరాలో వరి పంట వేయగా ఒక ఎకరాలో మామిడి పంట ఉంది. ఇన్‌పుట్ సబ్సిడీ కింద నాకు రూ.10,000 సాయం అందించింది జగనన్న ప్రభుత్వం. ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో ఇది ఎంతో ఉపయోగపడుతుంది. అలాగే మా పాపకు విద్యాదీవెన కూడా అందుతోంది.

– శంకర్, రైతు, నెల్లేపల్లి జీడి నెల్లూరు

ఆర్బీకేలతో ఉపయోగం



రాష్ట్రప్రభుత్వం రైతులకు ఉపయోగపడేలా రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. దీంతో మాకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చింది. అలాగే రైతు భరోసా పథకం కింద నేను లబ్ధి పొందాను. ఇప్పుడు ఇన్‌పుట్ సబ్సిడీ ద్వారా ప్రభుత్వం సాయం అందించడం సంతోషంగా ఉంది.

– రైతు మురగయ్య, జీడీ నెల్లూరు

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలపై సమీక్ష



మాట్లాడుతున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: చిత్తూరు కార్పొరేషన్ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో నిర్దేశించిన సౌకర్యాలన్నీ ఉండాల్సిందేనని ఏఈఆర్‌ఓ, కమిషనర్ డా.జె.అరుణ అధికారులను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలపై బుధవారం సాయంత్రం కార్పొరేషన్ కార్యాలయం నుంచి సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ సమీక్షించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో విద్యుత్ సౌకర్యం, ఫర్నీచర్, మరుగుదొడ్లు, నీటి సరఫరా తప్పనిసరిగా ఉండాలన్నారు. సూపర్‌వైజర్ అధికారులు ప్రత్యక్ష పరిశీలన చేసి ఏఎఫ్ఎం సౌకర్యాలపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. కార్పొరేషన్ పరిధిలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) సర్వే వేగంగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులు, వార్డు కార్యదర్శులను ఆదేశించారు. ఎంఎస్ఎంఈ సర్వేపై వార్డ్ అమినిటీ, పారిశుద్ధ్య పర్యావరణ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ప్రతి వార్డు పరిధిలో ఉత్పత్తి రంగం, వ్యాపార వాణిజ్య సంస్థలు, సేవలకు సంబంధించి సర్వేలు చేయాలన్నారు. వార్డు అమినిటీ, పారిశుద్ధ్య పర్యావరణ కార్యదర్శులు సమన్వయంతో సర్వే వేగంగా పూర్తి చేయాలని, ఇది వేగంగా జరిగేలా ఇంజినీరింగ్ అధికారులు, ప్రజారోగ్య విభాగం అధికారులు పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో ఎంఈ గోమతి, ఎంహెచ్‌ఓ డా.లోకేష్, డీఈలు వెంకట ప్రసాద్, రమణ, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



కొండామర్రిలో బాధితులకు చెక్కులను పంపిణీ చేస్తున్న పెద్దిరెడ్డి

చౌడేపల్లె: ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సహకారంతో మంజూరైన ఆర్థిక సాయం చెక్కులను బాధితులకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి బుధవారం అందజేశారు. మొత్తం రూ.7.09 లక్షల చెక్కులను కొండామర్రిలో టి.రామకృష్ణారెడ్డి(సామిరెడ్డిపల్లె)కి రూ.3.80 లక్షలు, ఆర్.సూర్యప్రకాష్ రెడ్డి(చింతమాకులపల్లె)కి రూ.1.90 లక్షలు, జి.ధనలక్ష్మి(నాగిరెడ్డిపల్లె)కి రూ.70 వేలు, వై.అలివేలమ్మ (మేకలవారిపల్లె)కు రూ.55 వేలు, ఆర్.రామ్మూర్తి రెడ్డి(చిన్నకంపల్లె)కి రూ.14 వేలు చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ కష్టకాలంలో తమను ఆదుకున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి కుటుంబానికి రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, ఎంపీపీ రామ్మూర్తి, మండల కన్వీనర్ అంజిబాబు, వైస్ ఎంపీపీలు సుధాకర్‌రెడ్డి, నరసింహులు యాదవ్ తదితరులు ఉన్నారు.

వందరోజుల పని కల్పించండి



కాలువ పనులను పరిశీలిస్తున్న పీడీ రాజశేఖర్

శ్రీరంగరాజపురం : ఉపాధిహామీ కార్యాలయాన్ని పీడీ రాజశేఖర్ ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి వందరోజులు పని దినాలు కల్పించాలని, కూలీల సంఖ్యను పెంచి, వారి హాజరును ఆన్‌లైన్‌లో పొందుపరచాలని తెలిపారు. ప్రతి కూలికి ఒక పనిదినానికి గరిష్టంగా రూ.272 ఇవ్వడం జరిగిందన్నారు. కూలీల హాజరులో ఏవైనా అవకతవకలు చేసినట్లయితే సంబంధిత అధికారిని విధుల నుంచి తొలగిస్తామన్నారు. అనంతరం పిళ్లారికుప్పంలో జరుగుతున్న ఫారం పాండ్, కాలువ పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఏపీఓ చంద్రశేఖర్, ఏపీడీ శోభన్‌బాబు, జేఈ జ్యోతి, టీఏలు పాల్గొన్నారు.

ఇన్ని రోజులు ప్రజలు గుర్తు రాలేదా ?

- పార్టీలోకి చేర్చుకుని ఆదరించి ఓ వ్యక్తిని ఎమ్మెల్యేని చేస్తే వెన్నుపోటు పొడిచాడు
- చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి





బహిరంగ సభావేదికపై నుంచి ప్రజలకు అభివాదం చేస్తున్న విజయానందరెడ్డి, పాల్గొన్న ప్రజలు

చిత్తూరు కార్పొరేషన్: అవసరాల కోసం ఎన్నికల సమయంలో మాయమాటలు చెప్పే దొంగలను నమ్మొద్దని వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి అన్నారు. బుధవారం శంకరయ్యగుంటలో 19, 20, 23, 24, 26 డివిజన్ నాయకుల ఆధ్వర్యంలో ఆ ప్రాంతావాసులతో నిర్వహించిన బహిరంగసభలో మాట్లాడారు. తొలుత నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అడుగడుగునా పూల వర్షం కురిపించారు. అనంతరం విజయానందరెడ్డి చర్చిలో ప్రార్థనలు చేసి, అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పించారు. అనంతరం బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ పన్నులు కట్టడం కాదని, ఇన్ని రోజులు ప్రజాసేవ ఎందుకు చేయలేదని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌పై ఘాటుగా విమర్శలు చేశారు. మాజీ ప్రజాప్రతినిధులంతా కలిసి వైఎస్సార్‌సీపీని ఓడించాలని కుట్ర పన్నుతున్నారని తెలిపారు. కోవిడ్ సమయంలో, వరదలు వచ్చినప్పుడు వీరికి ప్రజలు గుర్తుకు రాలేదా ? అని ప్రశ్నించారు. ఏ పార్టీలు ఆదరించకపోయినా వైఎస్సార్‌సీపీలో అవకాశం ఇచ్చి మా అందరి సహకారంతో ఎమ్మెల్యేగా గెలిచిన వ్యక్తి పార్టీకి వెన్నుపోటు పొడిచాడని ఆరోపించారు. ఎస్టీ మహిళ నాయకురాలు గాయత్రీదేవిని అవమానించారని గుర్తు చేశారు. కల్పతరువు లాంటి విజయ డెయిరీ, ఫ్యాక్టరీలను రాజకీయం చేసి మూయించారన్నారు. చిత్తూరుకు పెట్టుబడులు రానివ్వకుండా రౌడీయిజం చేశారని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యేలు సత్యప్రభ, మనోహర్ హుందాగా వ్యవహరించారన్నారు. ఇప్పుడు ఉన్న దొంగలముఠా వైఎస్సార్‌సీపీ మీద కక్ష గట్టి పనిచేస్తున్నాయని తెలిపారు. బహిరంగ సభలో ఇంతమందిని చూస్తుంటే ఆనందంగా ఉందని మేయర్ అముద తెలిపారు. ఈ అభిమానాన్ని ఓట్లుగా వేసి చూపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీని అఖండ మెజారిటీతో గెలిపించాలని డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్, రాజేష్‌కుమార్‌రెడ్డి కోరారు. టీడీపీ నాయకులు వ్యక్తిగతంగా మాట్లాడడం మానుకోవాలని మహిళా నాయకురాలు గాయత్రీదేవి సూచించారు. గతంలో ఎమ్మెల్యే అడుగడుగునా తనను అవమానించాడని, పార్టీలు మారడం ఆయనకు అలవాటు అని విమర్శించారు. కార్యక్రమంలో నగర పార్టీ అధ్యక్షుడు జ్ఞానజగదీష్, టిమ్ము, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ సరళామేరీ, కార్పొరేటర్లు పూమణి, చల్లాముత్తు, పార్టీ మైనార్టీ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ నాయకులు అన్బు, శేఖర్, డేవిడ్, రాజశేఖర్, సెంథిల్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలోనే కుప్పం అభివృద్ధి



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్సీ భరత్



జగనన్న కాలనీలో శిలాఫలకం ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ భరత్

- 83 గృహాలకు భూమిపూజ
- 480 మీటర్ల సీసీ రోడ్లు ప్రారంభం
- మోట్లచేను, కంసలవానికుంట గ్రామసభల్లో ఎమ్మెల్సీ భరత్

కుప్పంరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే కుప్పంలో నిజమైన అభివృద్ధి జరుగుతోందని ఎమ్మెల్సీ భరత్ అన్నారు. బుధవారం కుప్పం మండల పరిధిలోని మోట్లచేను, కంసలవానికుంట గ్రామాల్లో ఏర్పాటు చేసిన గ్రామసభల్లో ఆయన పాల్గొన్నారు. నాలుగు దశాబ్దాలుగా కుప్పం ఎమ్మెల్యేగా గెలుస్తున్న చంద్రబాబు కుప్పానికి చేసిందేమీ లేదన్నారు. ఆయన హయాంలో కేవలం నాలుగు మండలాల్లో 680 గృహాలు మాత్రమే మంజూరైతు, అందులో నిర్మాణం జరిగింది కేవలం పది శాతం ఇళ్లు మాత్రమే అన్నారు. అవి కూడా కూడా జన్మభూమి కమిటీలు, వారి పార్టీ నాయకులకే దక్కాయన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల వద్దకే వెళ్లి వలంటీర్లు పథకాలు అందిస్తున్నారని తెలిపారు. చెక్కునత్తం, మోట్లచేను గ్రామాలకు కలిసి 83 గృహాలు మొదటి విడతలోనే కేటాయించడం జరిగిందన్నారు.

సీసీ రోడ్లు ప్రారంభం..

మండలంలోని కాలనూరులో రూ.19 లక్షలతో వేసిన 170 మీటర్ల సీసీరోడ్డు, చెక్కునత్తంలో బరుగూరు రోడ్డు నుంచి తొట్లమ్మ ఆలయం వరకు రూ.23 లక్షలతో వేసిన 310 మీటర్ల సీసీ రోడ్లను ఎమ్మెల్సీ ప్రారంభించారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

కుప్పం మండలంలోని దొలగుట్ట గ్రామానికి చెందిన 40 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. బుధవారం చెక్కునత్తం గ్రామంలో ఎమ్మెల్సీ భరత్ వారికి కండువాలు వేశారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు ముఖ్యంగా కరువు నేల కుప్పానికి హంద్రీనీవా జలాలు తీసుకురావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అందుకే వైఎస్సార్‌సీపీ చేరామన్నారు. పార్టీలో చేరిన వారిలో వెంకటేష్, మురుగస్ తదితరులు ఉన్నారు.

సత్యప్రమాణానికి సిద్ధమా?



కాణిపాకంలో టీడీపీ నేతలు రామానుజం చలపతి, లత

కాణిపాకం: నగరిలో టీడీపీ తరపున ఎమ్మెల్యే టికెట్ తీసుకున్న నాయకుడు ఎలాంటి తప్పు చేయలేదని కాణిపాకంలో సత్యప్రమాణం చేయడానికి సిద్ధమా..? అని నగరి టీడీపీ నాయకులు రామానుజం చలపతి, లత సవాల్ విసిరారు. బుధవారం వారు కాణిపాకంలో నల్లదుస్తులు ధరించి, స్వామివారి ఆలయం ముందు కర్పూరం వెలిగించి పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ 1997 నుంచి టీడీపీకి విధేయులుగా ఉంటున్న తాము ద్రోహం చేయలేదన్నారు. కానీ దొంగలు, స్మగ్లర్లు చేసిన తప్పుల కారణంగా నగరిలో 2009, 2014లో వరుసగా టీడీపీ ఓటమిపాలైందన్నారు. మళ్లీ 2024లో కూడా టీడీపీ ఓటమి పాలవడం ఖాయమన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : కోడ్ అమల్లోకి వచ్చిన వెంటనే ఎన్నికల నిబంధనలు తప్పక పాటించాలని ఆదేశాలు ఇచ్చినట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆయన గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులు, తొలగింపునకు అందిన అభ్యంతరాలను వారంలోపు పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎన్నికలకు అవసరమైన సిబ్బంది నియామకం, సెక్టోరల్ అధికారులకు, ఇతర అధికారులకు శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించి కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఓ సమావేశ మందిరంలో ప్రత్యేక కంట్రోల్ రూంను ఏర్పాటు చేశామన్నారు.

షెడ్యూల్ వచ్చిన వెంటనే కోడ్ అమల్లోకి..

ఎన్నికల షెడ్యూల్ వచ్చిన వెంటనే కోడ్ అమల్లోకి వస్తుందని కలెక్టర్ షణ్మోహన్ వెల్లడించారు. పోలింగ్ సరళిని పర్యవేక్షించేందుకు వెబ్‌క్యాస్టింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సోషల్ మీడియాలో, మీడియాలో వచ్చే ప్రకటనలు, సభలు, సమావేశాలకు ముందస్తు అనుమతి తప్పనిసరి అని వెల్లడించారు.

పూతలపట్టులో సమీక్ష

పూతలపట్టు: ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలను నిర్వహించాలని అధికారులకు కలెక్టర్ సగిలి షణ్మోహన్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో జేసీ శ్రీనివాసులు, ఆర్డీఓ చిన్నయ్యతో కలిసి ఎన్నికల అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ వచ్చినప్పటి నుంచి ప్రభుత్వ, ప్రైవేటు స్థలాల్లో రాజకీయ పార్టీలు నిర్వహించే సమావేశాలకు ముందుగా డీఎస్పీ నుంచి అనుమతి తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.